క్లుప్తంగా

కాలుష్య రహిత ఏలూరుకు కృషి



మొక్కను నాటుతున్న మేయర్ తదితరులు

ఏలూరు (టూటౌన్): ఎయిర్ పొల్యూషన్ లేని ఏలూరు నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్టు మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ పొల్యూషన్ పిలుపులో భాగంగా పాత బస్టాండ్ నుంచి తూర్పులాకుల వరకు గూడ్స్ షెడ్డు రోడ్డు, కృష్ణా కాలువ వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కమిషనర్ ఎ.భానుప్రతాప్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, దాకారపు రాజేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ పోటీలు

ఏలూరు రూరల్ : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-23 మల్టీ డే క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహించామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ త్రిసభ్య కమిటీ సభ్యుడు ఎస్కే సాకిర్‌హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 17 వరకు మూలపాడులో జరిగే అంతర జిల్లాల మల్టీ డే క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని పేర్కొన్నారు. జట్టులో కె.రేవంత్ నాగకుమార్ (కెప్టెన్), పి.భువనేశ్వర్ (వైస్ కెప్టెన్), కేకేఎస్ఎన్ హరీస్ (వికెట్ కీపర్), వీఎంవీఎస్ రక్షణ్, కె.జాన్ రిచర్డ్స్, వి.జస్విన్, ఎం హర్షవర్దన్, జి.దీపక్‌చంద్, జి.చరణ్‌సాయి తేజ, ఎం రిత్విక్, ఎండీ మెహబూబ్ ఆలీ, వై చైతన్యకుమార్, బీహెచ్ సాయిసుశాంత్, పి.శ్రీసాయి, వి.లోహిత్, కేఎస్ఎన్ రాజు, స్టాండ్ బైగా ఎస్ లిఖితేశవ, డి.యశ్వంత్, జోగి శ్రేయర్, వి జయంత్‌సాయి ఉన్నారు.

అబ్బురపరుస్తున్న సూక్ష్మ వినాయకులు



సూది బెడ్‌పై చెక్కిన వినాయక ప్రతిమ



అగ్గిపుల్లపై మలిచిన వినాయకుని చిత్రం

ఏలూరు (టూటౌన్): వినాయక చవితి సందర్భంగా సూక్ష్మ వినాయకులను రూపొందించి అబ్బుర పరుస్తున్నారు ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారులు. దోర శివప్రసాద్ సూది బెడ్‌పై సరిపడేంత సైజు చెక్కతో వినాయకుడిని చెక్కారు. మేతర సురేష్ బాబు అగ్గిపుల్ల మొనపై వినాయకుడి చిత్రాన్ని చెక్కారు.

చింతమనేని ఆగడాలు అడ్డుకుంటాం



పీవీ రావు

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిపై చింతమనేని, అనుచరులు దాడులు చేయడం అన్యాయమని వైఎస్సార్ సీపీ నాయకుడు పీవీ రావు అన్నారు. మంగళవారం ఆయన అబ్బయ్యచౌదరితో మాట్లాడారు. కొల్లేరు ప్రజలను అడ్డు పెట్టుకొని చింతమనేని ప్రభాకర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభాకర్‌కు సత్తా ఉంటే వైఎస్సార్ సీపీ హయాంలో దెందులూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిలో 10 శాతం చేసి చూపాలన్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకుల అరాచకాలు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు అధికారుల అండతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు.

రేపు నిరసన కార్యక్రమాలు

ఏలూరు (టూటౌన్): బషీరాబాగ్ విద్యుత్ ఉద్యమ అమరుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న కార్యక్రమాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఐఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకుల సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన నిర్వహించారు. రవి మాట్లాడుతూ 2000లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపితే రాష్ట్రంలో ఉన్న వామపక్ష పార్టీలు సాగించిన పోరాటాలలో ఆగస్టు 28న బషీర్బాగ్ సంఘటనలో ముగ్గురు ఉద్యమకారులు అమరులయ్యారన్నారు. అదే చంద్రబాబు విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉండి కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల బిల్లును రాష్ట్రంలో అమలు చేస్తూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తూ రాష్ట్ర ప్రజానీకం పై భారాలు మోపడానికి ప్రయత్నిస్తున్నాడని వారు ఆరోపించారు. గురువారం ఉదయం 10 గంటలకు ఏలూరు పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

మద్యం వ్యాపారుల బెంబేలు

- పాకిస్తున్న నూతన బార్ పాలసీ
- ఏలూరులో 12 బార్లకు రెండే దరఖాస్తులు



ఏలూరులోని ఒక బార్ అండ్ రెస్టారెంట్ (ఫైల్)

ఏలూరు టౌన్: కూటమి సర్కారు ద్వంద్వ విధానాలతో మద్యం వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులు కట్టబెట్టారు. తొలుత మద్యం షాపుల నిర్వాహకులకు 20 శాతం మార్జిన్ ఇస్తామని నమ్మించారు. కానీ ప్రస్తుతం 12 శాతం ఇవ్వటమే గగనంగా మారింది. తాజాగా నూతన బార్ పాలసీతో మార్కెట్‌లో బార్లు నిర్వహించటం కష్టమేనని, లాభాల మాటెలా ఉన్నా, భారీ నష్టాలు తప్పవని బార్ల యజమానులు హడలిపోతున్నారు. ఏలూరు నగరంలో బార్‌లకు కొత్తగా లైసెన్సులకు నోటిఫికేషన్ ఇస్తే రెండంటే రెండు దరఖాస్తులు రావడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు.

భంగపాటు

ఏలూరు నగరంలో 11 జనరల్ కేటగిరీ బార్లు, ఒకటి గీత కార్మిక కులాలకు ఒక బార్‌ను కేటాయించారు. ఈనెల 18న నూతన బార్ పాలసీ విధానంతో కొత్తగా బార్ లైసెన్సుల మంజూరుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులకు ఈనెల 26 వరకు గడువు ఇచ్చారు. కేవలం రెండే దరఖాస్తులు అందాయి. ఈనెల 28న దరఖాస్తులు పరిశీలించి, లాటరీ విధానంలో బార్ల లైసెన్సులకు అనుమతులు ఇవ్వనున్నారు. ఏలూరు నగరంలో మొత్తంగా 12 బార్లు ఏర్పాటుకు భారీగా దరఖాస్తులు వస్తాయన్న అంచనాలు తల్లకిందులయ్యాయి. దీంతో కూటమి ప్రభుత్వానికి భంగపాటు తప్పలేదంటున్నారు.

బార్ లైసెన్సులకు స్పందన కరువు

ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులు ఇస్తారని, మద్యం భారీగా విక్రయించి కోట్లు అర్జించవచ్చనుకున టీడీపీ శ్రేణులకు సీఎం చంద్రబాబు నూతన విధానాలు షాక్ మీద షాక్ ఇస్తున్నాయి. ఏలూరు నగరంలో 21 ప్రైవేటు మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో 16 షాపులకు పర్మిట్ రూమ్‌లకు అనుమతులు తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఒక్కో షాపు నిర్వాహకుడు పర్మిట్ రూమ్‌కు ఏడాదికి రూ.7.50 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటు మద్యం షాపులకు పర్మిట్ రూమ్స్ ఇస్తే, అవన్నీ మినీబార్లుగా మారిపోతాయని, ఇది బార్లపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయనే అభిప్రాయంతో కొత్తగా బార్ లైసెన్సుకు దరఖాస్తు చేసేందుకు ఎవరూ ముందుకు రావటంలేదని చెబుతున్నారు.

ఫీజు తగ్గించినా ఫలితం లేదు

ఏలూరులో బార్ లైసెన్సుకు రూ.5 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఏడాదికి రూ.55 లక్షలు లైసెన్సు ఫీజు కట్టాలి. గత ప్రభుత్వంతో పోల్చితే లైసెన్సు ఫీజును కూటమి ప్రభుత్వం భారీగా తగ్గించింది. కానీ మద్యం వ్యాపారులపై కనిపించని విధంగా ఆర్థిక భారం పడుతుండడంతో మద్యం వ్యాపారం చేయటం తమ వల్ల కాదంటున్నారు. దీనికి ప్రతి వీధిలోనూ ప్రైవేటు మద్యం దుకాణం ఉండడం, దీనికి పర్మిట్ రూమ్ ఇవ్వటమే కారణమంటున్నారు.

బార్ లైసెన్సు గడువు పెంపు



నూతన బార్ పాలసీలో బార్లు ఏర్పాటుకు ప్రభుత్వం మూడేళ్ల కాల పరిమితితో బార్ లైసెన్సు మంజూరు చేస్తుంది. ఈనెల 28 తేదీ వరకు బార్ లైసెన్సుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాం. ఈనెల 30న ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో దరఖాస్తులు పరిశీలించి లాటరీ విధానంలో ఎంపిక చేస్తాం. ఆసక్తి గల వ్యాపారులు దరఖాస్తులు సమర్పించవచ్చు. ప్రభుత్వం లైసెన్సు ఫీజును ఆరు దఫాలుగా చెల్లించుకునేలా వెసులుబాటు ఉంది.

– ఎ.అవులయ్య, జిల్లా అధికారి, ఎక్సైజ్ శాఖ

కామన్ సైట్‌లో ఇంటి నిర్మాణం

జిల్లా కలెక్టర్‌కు స్థానికురాలు ఫిర్యాదు



కామన్ సైట్‌లో చేపట్టిన పక్కా ఇంటి నిర్మాణం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్ ఆముదాల అప్పలస్వామి కాలనీ పరిధిలో ప్రభుత్వ పోరంబోకు భూమిలో ప్రైవేటు వ్యక్తి పక్కా ఇంటి నిర్మాణం చేపట్టినప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని అదేప్రాంతానికి చెందిన జి.రాణి ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. గతంలో ఇదే విషయంపై ఫిర్యాదు చేస్తే అప్పుడు అక్కడ ఎటువంటి నిర్మాణాలు లేవని నగరపాలక సంస్థ అధికారులు సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. తమ పరిశీలనలో అక్కడ నేల చదును చేసి ఉందని, దాన్ని చేసిన వారు ఎవరో తెలియలేదని వివరించారని గుర్తు చేశారు. ఒకవేళ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే ఏపీ మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని సమాధాని ఇచ్చారని తెలిపారు. మళ్లీ నెల తిరగక ముందే సదరు ప్రభుత్వ పోరంబోకు భూమిలో పక్కా ఇంటి నిర్మాణం చేస్తున్నారని ఆధారాలతో ఆరోపించారు. తక్షణం దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి, అదే స్థలంలో స్థానికులందరికీ ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని రాణి తన ఫిర్యాదులో కోరారు.

మఠం కూల్చివేత ప్రయత్నాలు విరమించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తిరుపతిలోని శ్రీ హాథిరాం బావాజీ మఠాన్ని కూల్చివేయాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఎస్టీ బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్య నాగేశ్వరావు నాయక్, జి.కృష్ణ, ధారావతు కీమ్యా నాయక్, దారావతు రాజబాబు నాయక్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 15 కోట్ల యావత్ బంజారా సమాజ ఆత్మగౌరవం, విశ్వాసం, భావజాలాన్ని గాయపరిచే చర్యకు పూను కుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మట్టి గణపతులనే పూజిద్దాం



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ గాయత్రి



సీఆర్ఆర్ మహిళా కళాశాలలో పూజ చేస్తున్న ప్రతినిధులు



మట్టి ప్రతిమలు తయారుచేసి ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పర్యావరణానికి హితమైన మట్టి గణపతి విగ్రహాలనే వినాయక చవితికి వినియోగించాలని ఏలూరు తహసీల్దార్ గాయత్రి అన్నారు. స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలను మంగళవారం సాయంత్రం తహసీల్దార్ పంపిణీ చేశారు.

500 ప్రతిమల పంపిణీ..

సామాజికవేత్త మానేపల్లి రామారావు నగరంలోని పలు ప్రాంతాల్లో 500 మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలనే వినియోగించేలా ప్రతినబూనాలని రామారావు కోరారు.

సీఆర్ఆర్ కళాశాలలో ఉత్సవాలు

ఏలూరు సీఆర్ఆర్ మహిళా కళాశాలలో గణిత శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ ఉత్సవాలు నిర్వహించారు. వేదికపై మట్టి గణపతి ప్రతిమను ఏర్పాటు చేసి అన్ని రకాల పత్రులతో పూజించారు. వినాయక వ్రత కథ చదివి విద్యార్థులకు కథలోని విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి కరస్పాండెంట్ వంకినేని భాను ప్రకాష్, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.హిమబిందు, వైస్ ప్రిన్సిపాల్ కె.రూప్సీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మట్టి గణపతితోనే మేలు

మట్టి ప్రతిమలని వినియోగించడమే పర్యావరణానికి మేలని ఏలూరు శ్రీ శర్వాణి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సత్యశారద అన్నారు. మట్టి గణపతి ప్రతిమల తయారీలో మంగళవారం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ కె.మదన్ మోహన్ రాజు, ఇన్‌చార్జి జి.రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-శ్రం పోర్టల్‌లో నమోదు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): అసంఘటిత కార్మికులు వివరాలను ఈ-శ్రం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఆయన మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జంగారెడ్డిగూడెం స్నేహ మహిళ అభ్యుదయ సభ్యులకు బాల్య వివాహాలు వల్ల జరిగిన నష్టాలతో పాటు అసంఘటిత కార్మికులు చట్టాలు, ఇతర మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అసంఘటిత కార్మికులు ఈ-శ్రం పోర్టల్‌లో నమోదైతే సంక్షేమ పథకాలను సులభతరంగా పొందవచ్చునని తెలిపారు. ప్రతి వ్యక్తికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, ఆ హక్కులకు భంగం కలిగినప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని అన్నారు. అసిస్టెంటు కమిషనరు ఆఫ్ లేబర్ కె.నాగేశ్వరరావు, మాస్టర్స్ ట్రైనరు పి.రత్నరాజు, ప్యానల్ న్యాయవాది కూనా కృష్ణారావు, స్నేహ మహిళ అభ్యుదయ సభ్యులు మానస, సుంకర సత్యనారాయణ, గొల్ల కృష్ణ, బి.మంగతాయారు, యు.మంగ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

ఖైదీలకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ సూచించారు. ప్రతినెలా నిర్వహించే తనిఖీల్లో భాగంగా జిల్లా కారాగాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఖైదీలకు అందుతోన్న సేవలపై ఆరా తీశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పీవీఎస్ మునీశ్వరరావు, జైలర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలి రేట్లు పెంపు



కార్మిక సంఘాల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో వివిధ పచారీ షాపుల్లో లోడింగ్ అన్ లోడింగ్ హమాలీలు, కార్మిక వర్గ ప్రతినిధులకు ఏలూరు మర్చంట్ చాంబర్ అసోసియేషన్, వర్తక వాణిజ్య వ్యాపారులకు సంప్రదాయ పద్ధతుల్లో కూలి రేట్లపై రెండేళ్లకోసారి ఒప్పందం చేసుకుంటారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఇస్తున్న కూలి రేట్లపై 7 శాతం పెంపుదల చేస్తూ ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో ఒప్పందం చేసుకున్నట్టు ఏఐటీయూసీ - ఐఎఫ్‌టీయూ అనుబంధ ఉమ్మడి జట్లు లాగుడు బండ్ల ముఠా కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఏలూరు వన్ టౌన్ రైతు బజార్ ఆవరణలో మంగళవారం ఉదయం కార్మిక సంఘాల నాయకులు గడసాల రాంబాబు, పుప్పాల కన్నబాబు అధ్యక్షతన నిర్వహించిన జనరబాడీ సమావేశంలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ ఒప్పందం 2025 ఏప్రిల్ 10 నుంచి అమలులో ఉంటుందని తెలిపారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడారు. ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు, ఉభయ సంఘాల కార్మికులు జగ్గవరపు రమణ, ముంగము అప్పారావు, సందకం అప్పారావు, దూళ్ల వీరినాయుడు, అన్నవరం, ప్రసాదు, భూపతి, రామ్మూర్తి నాయుడు, జనార్ధన్, విష్ణు, రాంబాబు, పెచ్చేటి శ్రీనివాస్ రావు, ఎస్ సోమేశ్వరరావు, కర్ణం సురేషు, ఎస్ రాంబాబు, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్‌గా ఏలూరు జిల్లా జట్టు



చాంపియన్‌గా నిలిచిన ఏలూరు జిల్లా జట్టు

ఏలూరు రూరల్: ఏలూరు జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు అమరావతి చాంపియన్‌గా నిలిచింది. జాతీయ క్రీడా దినోత్సవం నేపథ్యంలో స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ నెల 23 నుంచి 26 వరకూ తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏలూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గత వారం పిఠాపురంలో జరిగిన జోన్‌స్థాయి పోటీల్లో గెలుపొందిన ఏలూరు జట్టు రాష్ట్రస్థాయికి అర్హత సాధించిన సంగతి తెలిసిందే. విజేతలకు ఈ నెల 29న బహుమతులు అందజేస్తారని కోచ్ కె.మురళీకృష్ణ చెప్పారు.